క్లుప్తంగా

నేడు పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

మోమిన్‌పేట: ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం సర్వసభ్య సమావేశం సోమవారం పీఏసీఏస్ కార్యాలయంలో ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు సీఈఓ శేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డైరెక్టర్లు, సభ్యులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు. సంఘం ఇప్పటి వరకు ఇచ్చిన రుణాలు, వసూళ్లు, ఎరువులు, విత్తనాలు అమ్మకాలపై వచ్చిన ఆదాయం తదితర అంశాలపై చర్చా ఉంటుందని తెలిపారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రమేశ్

కుల్కచర్ల: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని కుల్కచర్ల ఎస్‌ఐ రమేశ్ పేర్కొన్నారు. ఆదివారం కుల్కచర్ల మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో సీసీ కెమెరాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతీ గ్రామంలోని ప్రధాన చౌరస్తాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల నేరాల సంఖ్యను తగ్గించవచ్చన్నారు. ముఖ్యంగా దుకాణదారులందరూ తప్పనిసరిగా ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్, నాయకులు సార శ్రీనివాస్, అనంతయ్య, కృష్ణయ్య, భీమయ్య, వెంకటయ్య, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్ అందిస్తున్న నాయకులు

కుల్కచర్ల: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని చౌడాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం చౌడాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేసి నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేదలకు కాంగ్రెస్ అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో దామోదర్ రెడ్డి, వెంకటయ్య గౌడ్, సలీం, చెన్నయ్య, శ్రీధర్ రెడ్డి, శేఖర్, రాజేందర్ రెడ్డి, రాము, గోపాల్, అంజయ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కాగ్నా బ్రిడ్జికి తాత్కాలిక మరమ్మతులు



కోతకు గురైన ప్రదేశంలో పనులు నిర్వహిస్తున్న సిబ్బంది

యాలాల: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతకు గురైన కాగ్నా బ్రిడ్జికి అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. రెండు మూడు రోజులుగా కురిసిన వర్షానికి కాగ్నా నది ఉప్పొంగి ప్రవహించడంతో కోకట్ కాగ్నా బ్రిడ్జి ఓ భాగం కోతకు గురైంది. దీంతో తాండూరు–రాస్నం మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశాలతో కోతకు గురైన బ్రిడ్జి ప్రదేశంలో మరమ్మతు పనులు చేయించారు. అనంతరం బ్రిడ్జిపై నుంచి వాహనాల రాకపోకలకు అనుమతించారు.

ఎన్కేపల్లి మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రదర్శన



నృత్య కళా బృందం తదితరులు

పూడూరు: తిరుమల తిరుపతి దేవస్థానంలో జరుగుతున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో పూడూరు మండల పరిధిలోని ఎన్కేపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శన ఇచ్చారు. థింసా, గుస్సాడి, లంబాడీ, కోయ నృత్య ప్రదర్శన చేసి పలువురిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సరళ వారిని అభినందించారు.



రోడ్డు పరిస్థితి



బెల్కటూర్‌కు వెళ్లేమార్గంలో రోడ్డుపై ఏర్పడిన గుంత

బెల్కటూర్ బేజార్

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- పట్టించుకోని కాంట్రాక్టర్, అధికారులు

తాండూరు రూరల్: కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారులు పట్టించుకోక పోవడంతో సామాన్య ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఉన్న రోడ్డును తవ్వి.. మొరంవేసి వదిలేశారు. సక్రమంగా రోడ్డు పనులు చేపట్టకపోవడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని చెబుతున్నారు. భారీ వర్షాల వల్ల మొరం, కంకర కొట్టుకపోయి రోడ్డంతా బురదమయంగా మారింది. ఆయా గ్రామాల ప్రజలు ఈ దారిగుండా వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాండూరు మండలం బెల్కటూర్ గ్రామ సమీపంలోని వాగు వద్ద రూ.2.30కోట్లతో నూతనంగా బ్రిడ్జి నిర్మించారు. దానికి ఇరువైపులా అప్రోచ్‌రోడ్డు నిర్మిస్తున్నారు. అదేవిధంగా గౌతపూర్ చెక్‌పోస్ట్ నుంచి కరన్‌కోట్ గ్రామానికి ఆర్‌అండ్‌బీ నిధులతో రూ.4.60కోట్లతో రోడ్డు రెన్యూవల్ పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ బెల్కటూర్ రైల్వేగేటు నుంచి నూతన బ్రిడ్జి వరకు తవ్వించారు. ఆ తర్వాత రోడ్డు లెవలింగ్‌లో భాగంగా మొరంవేసి వదిలేశారు. దీంతో ఇటీవల కురిసిన వానలకు ప్రస్తుతం బెల్కటూర్ రైల్వేగేటు నుంచి నూతన బ్రిడ్జి వరకు బురదగా మారింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఈ దారిగుండా వెళ్తే..

ఈ దారిగుండా వెళ్తే ఆటోలు, ద్విచక్రవాహనాలు బురదలో ఇరుక్కుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా బెల్కటూర్, చిట్టిఘనాపూర్, చంద్రవంచ, కరన్‌కోట్, ఓగిపూర్ గ్రామస్తులు అష్టకష్టాలు పడుతున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే తమకు ఈ దుస్థితి దాపురించిందని వాపోతున్నారు. అక్కడక్కడ పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయని చెబుతున్నారు. రాత్రి సమయం, అత్యవసర పరిస్థితుల్లో వెళ్లాలంటే వాహనదారులు జంకుతున్నారు. కొన్నిసార్లు ప్రమాదాలు కూడా చోటు చేసుకున్నాయని వివరిస్తున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ శాఖ డీఈ శ్రావణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. బురదమయమైన రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయిస్తానని చెప్పారు. రోడ్డు పనులు జరుగుతున్నాయని అకాల వర్షం కారణంగా పనుల్లో జాప్యం జరుగుతున్న మాట వాస్తవం. ఈ విషయం గురించి కాంట్రాక్టర్‌తో మాట్లాడి వేగంగా రోడ్డు పనులు చేయిస్తానని వివరణ ఇచ్చారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత

- నిలిచిపోయిన నిర్మాణాలు
- ఆందోళనలో లబ్ధిదారులు
- పట్టించుకోని అధికారులు



నిర్మాణపనులు నిలిచిపోయిన ఈర్లపల్లిలోని ఇందిరమ్మ ఇల్లు

దుద్యాల్: ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరతతో మండలపరిధిలోని కొన్ని గ్రామాల్లో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. మరికొన్ని గ్రామాల్లో కొనసాగుతున్నాయి. వాగులు ఉన్న గ్రామాల్లో ఇసుకు అందుబాటులో ఉండడంతో పనులు వేగంగా సాగుతున్నాయి. కానీ మండల పరిధిలోని ఈర్లపల్లి, సంత్రకుంట, నన్యా నాయక్ తండాల్లో ఇసుక కొరత కారణంగా ఇదిరమ్మ ఇళ్ల నిర్మాణం నిలిచిపోయాయి. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుక అందిస్తామని ప్రకటించింది. ఆచరణలో మాత్రం కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల కారణంగా వాగులు నిండుగా ప్రవహిస్తుండడంతో ఇసుక బయటకు తీయడం కష్టంగా మారిందని అధికారులు చెబుతున్నారు. ఈర్లపల్లి గ్రామానికి చెందిన లబ్దిదారు లావణ్య ఇంటి నిర్మాణానికి ఇసుక లేకపోవడంతో నెల రోజుల నుంచి పనులు నిలిచిపోయాయని చెబుతుంది. ఇసుక తీసుకొచ్చేవారిని అడిగితే అధికారులు అనుమతులు ఇవ్వడం లేదని పేర్కొన్నారన్నారు. అధికారులు స్పందించి ఇసుక కొరత నివారించాలని లబ్దిదారులు వేడుకుంటున్నారు.

నేడు ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశం

తాండూరు రూరల్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా తాండూరు నియోజకవర్గంలో మొట్ట మొదటి ఇల్లు పూర్తయ్యిందని అధికారులు పేర్కొన్నారు. పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హాజరవుతున్నట్లు క్యాంప్ కార్యాలయ సిబ్బంది ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

భగత్‌సింగ్ ఆశయసాధనకు కృషి



నివాళులర్పిస్తున్న శివారెడ్డిపేటవాసులు

అనంతగిరి: స్వాతంత్య్రం కోసం తన ప్రాణాలను అర్పించిన భగత్‌సింగ్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఆదివారం భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని వికారాబాద్ పట్టణం శివారెడ్డిపేటలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కొండాయపల్లిలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

దోమ: దోమ మండల పరిధిలోని కొండాయపల్లి గ్రామంలో ఆదివారం డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆ గ్రామస్తులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న గ్రామస్తులు

బీజేపీ మండలాధ్యక్షుడిగా జగదీశ్



సమావేశంలో బీజేపీ నాయకులు

బొంరాస్‌పేట: బీజేపీ మండలాధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ఉప్పరి జగదీశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను ఎంపిక చేసినట్లు బీజేపీ నాయకులు చెప్పారు. దుప్‌చర్లకు చెందిన శ్రీనివాస్‌ను ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు నర్సింలు సాగర్, బాబయ్య నాయుడు, నాగూరావు, ముకుందం పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్య

కుల్కచర్ల: స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని బీజేపీ కుల్కచర్ల మండల అధ్యక్షుడు వెంకటయ్య పేర్కొన్నారు. ఆదివారం రాంనగర్ గ్రామ పంచాయతీలో మన్‌కీబాత్ కార్యక్రమాన్ని స్థానిక నేతలతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా మోదీ అనుసరిస్తున్న అత్యద్భుతమైన పాలన గురించి గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. కేంద్ర పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలన్నారు. దేశ రక్షణకు ప్రథమ ప్రాధాన్యతనిచ్చే పార్టీ బీజేపీ ఒక్కటేనన్నారు. కాబట్టి ప్రతిఒక్కరూ దేశం కోసం, ధర్మం కోసం పనిచేసే పార్టీని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరేష్, మల్లేష్, శ్రీశైలం, ప్రశాంత్, ఆంజనేయులు, పోలిమోని వెంకటయ్య, భీమయ్య, రమేష్, హన్మంతు, శివకుమార్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సాయం

పూడూరు: మండల పరిధిలోని చన్గోముల్ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటునకు బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు రహీంఖాన్ ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుతో గ్రామ ప్రజలకు భద్రత పెరుగుతుందన్నారు. అనంతరం లక్ష రూపాయలను పంచాయతీ కారోబార్ బందయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



చన్గోముల్‌లో పంచాయతీ కారోబార్‌కు నగదు అందిస్తున్న నాయకులు

'కాలకేయుడి' సందడి

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ చెరువు అలుగులో బహుబలి ఫేం కాలకేయ ప్రభాకర్ ఆదివారం సందడిగా గడిపారు. మూడేళ్ల తర్వాత చెరువు అలుగు పారడంతో హస్నాబాద్‌తో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన పర్యాటకులు పోటెత్తారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.



పర్యాటకులతో సెల్ఫీ దిగుతున్న కాలకేయ ప్రభాకర్

పోలేపల్లిలో ఆర్‌ఎస్‌ఎస్ కవాతు

దుద్యాల్: ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కార్యకర్తలు మండల పరిధిలోని పోలేపల్లిలో ఆదివారం కవాతు నిర్వహించారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రారంభించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా నిర్వహించారు. భారత్ మాతాకి జై..అంటూ వీధుల గుండా నినాదాలు చేశారు. అనంతరం ఆంజనేయ స్వామి దేవాలయం దగ్గర ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. డాక్టర్ కేశవరావు బలీరామ్ హెడ్గావార్ 1925లో విజయదశమిని పురస్కరించుకుని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ స్థాపించారన్నారు. నాటి నుంచి నేటి వరకు తమ కార్యకలాపాలు కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు బెర్కుటి మల్లేశ్ యాదవ్, శ్రీరాం, వెంకటేశ్ యాదవ్, సుదర్శన్ రెడ్డి, బాల్‌రాజ్, రాజశేఖర్, గణేశ్, చంద్రప్ప, బిచ్చప్ప తదితరులు పాల్గొన్నారు.



దుద్యాల్: అంజనేయ స్వామి ఆలయం వద్ద నినాదాలు చేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

వ్యక్తి నిర్మాణం ద్వారానే దేశ నిర్మాణం

మోమిన్‌పేట: వ్యక్తి నిర్మాణం ద్వారానే దేశ నిర్మాణం జరుగుతుందని పాలమూర్ భౌద్దిక్ ప్రముఖ్ కట్ట ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మాణిక్ ప్రభు మందిరం వద్ద ఆర్‌ఎస్‌ఎస్ శత సంవత్సరాల స్థాపనలో భాగంగా కవాతు నిర్వహించారు. నేడు విభిన్న రంగాల్లో దేశ వ్యాప్తంగా హిందూత్వ ఆధార సంస్థలతో అనేక దేశాల్లో తమ సంస్థ పనిచేస్తుందన్నారు. హిందూవుల్లో ఐక్యతను పెంపొందిస్తూ జీవన విధానంలో విశ్వశాంతికి ఆధారంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అంరాధి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను గౌరవించాలి

సీఐ శ్రీనివాస్‌రెడ్డి

పరిగి: ప్రతిఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలని పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని రంగాపూర్ శ్రీ సత్యసాయి సేవాకేంద్రంలో మాతృ పూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులను మించిన దైవం లేదన్నారు. తల్లిదండ్రులు పిల్లలను సన్మార్గంలో నడిచేల పెంచాలని సూచించారు. చిన్నారులు విద్యార్థి దశనుంచే సేవా తత్వాన్ని అలవర్చుకునేలా తయారు చేయాలన్నారు. ఇప్పటి నుంచి భక్తి మార్గాన్ని అనుసరించేలా ఆధ్యాత్మికత, ఇతిహాసాల గురించి బోధన చేయాలన్నారు. నిత్యం శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ మోహన్‌కృష్ణ, సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు జగన్ సింగ్‌ఠాకూర్, ప్రభాకర్, బస్వరాజ్, సోలిపేట బ్రదర్స్ సత్యనారాయణరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాతృ పూజ నిర్వహిస్తున్న దృశ్యం

జెడ్పీటీసీగా అవకాశం కల్పించండి

కాంగ్రెస్ సీనియర్ నేత రజిత గౌడ్



దోమ: ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తూ సమాజ శ్రేయస్సుకు కృషి చేస్తున్న తమకు తప్పనిసరిగా జెడ్పీటీసీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని ఐనాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ నేత ఈడిగి రజితగౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. తమ కుటుంబం కొన్ని సంవత్సరాల నుంచి పార్టీని అట్టిపెట్టుకొని ప్రయాణం సాగిస్తుందని తెలిపారు. ఏనాడు మండల స్థాయి పదవులను అనుభవించలేదని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ప్రకటించిన 42 శాతం రిజర్వేషన్లలో దోమ జెడ్పీటీసీ బీసీ అభ్యర్థిగా మొదటి ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ విషయంలో పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి కృషి చేయాలని సూచించారు. తమ మామ ఈడిగి ఆశన్నగౌడ్ భార్య యాదమ్మగౌడ్ గతంలో ఐనాపూర్ సర్పంచ్‌గా ప్రజలకు సేవలందించారని గుర్తు చేశారు. ఎమ్మెల్యేగా నాలుగు సార్లు బరిలో ఉంటే గెలుపునకు ఎంతో దోహదపడ్డామని పేర్కొన్నారు. అంతే కాకుండా సమాజ శ్రేయస్సుకు దోహదపడుతూ, నిరుపేద కుటుంబాలకు తమవంతు సహాయ సహకారాలు అందజేస్తున్నామని పేర్కొన్నారు. పార్టీకి అధికారం లేని సందర్భంలో తమపై ఎన్నో కేసులను పెట్టారని, ఏనాడు పార్టీకి ద్రోహం చేయలేదని తెలిపారు. ఈ సారి తమకు సీటు కేటాయించాలని, ఈ విషయంలో ఎమ్మెల్యే చొరవ చూపాలని కోరారు.

రైతులను ఆదుకోవాలి

గాజీపూర్ మాజీ సర్పంచు వీరప్ప

తాండూరు రూరల్: ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికొచ్చే సమయంలో భారీ వర్షానికి పాడయ్యాయని గాజీపూర్ మాజీ సర్పంచు తలారి వీరప్ప పేర్కొన్నారు. ఆదివారం పెద్దేముల్ మండలం గాజీపూర్ గ్రామంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వీరప్ప మాట్లాడుతూ..భారీ వర్షాల కారణంగా పత్తికి భారీ నష్టం ఏర్పడిందన్నారు. ప్రభుత్వం వెంటనే నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



ధారూరు: నాగారం సబ్‌స్టేషన్‌లో పూజలు నిర్వహిస్తున్న విద్యుత్ అధికారులు, సిబ్బంది



కుల్కచర్ల: కాళమ్మ దేవాలయం వద్ద హోమం నిర్వహిస్తున్న భక్తులు



దుద్యాల్: దుర్గామాత పూజలో భక్తులు

కొనసాగుతున్న నవరాత్రోత్సవాలు

దసరా శరన్నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్‌లో ఏర్పాటు చేసినా ఆయా మండపాల్లో, ఆలయాల్లో దుర్గామాతకు నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం అమ్మవారు మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవారికి దూపదీప, నైవేద్యాలు సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఆయా మండపాల వద్ద హోమాలు, అన్నదానం నిర్వహించారు.



అనంతగిరి: రామ మందిర్‌లో అమ్మవారికి పండ్లతో అలంకరణ



అనంతగిరి: వైభవలక్ష్మి ఆలయంలో మహాచండీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



దౌల్తాబాద్: సుల్తాన్‌పూర్‌లో దుర్గామాత పూజలో భక్తులు



ధారూరు: కాత్యాయిని దేవి అవతారంలో..



ధారూరు: అమ్మవారికి హారతి ఇస్తున్న మహిళా భక్తులు



తాండూరు రూరల్: గౌతపూర్‌లో దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు



బొంరాస్‌పేటలో దుర్గామాతకు పూజలు